పెద్ద మంటల్నిండుకున్నాయిట. పక్క గుడిసెలకు కూడా అగ్గి పాకింది. ఆ మంటలనుంచి ఆడు బయటికి రాలేకపోయినాడమ్మా. నా సూరేడు ఆ మంటలకు భయపడి, మూర్ఛపోయినాడు. ఆడింట్లోనే వున్నాడని ఎవరూ తెలుసుకోలేకపోయినారు. ఎవరి ఆదుర్దా వాళ్ళదైపోయింది. నేనింటికెల్లి సూసే సరికి, యింత ఘోరం జరిగిపోయింది. నా యిద్దరు బిడ్డలూ భయంగా నన్ను సుట్టేసుకున్నారు.

'అమ్మా, అన్న....అన్న' అంటూ పెద్దపిల్ల ఏడిసింది గుడిసెను చూపుతూ.

హడలిపోయి, యింటి దగ్గరికి పరుగెత్తుకెళ్ళి చూసాను. యింకేం మిగిలింది? అణ్ణాలా చూసే సరికి, నా పై ప్రాణాలు పైనే పోయినాయి. ఎంత యేడ్చినానో....నా సూరీడు మల్లా వుదయించనేదమ్మా. నా కెప్పుడూ చీకటే. ఈ దీపావళి అమవాస చీకటే నాకు దక్కింది. ఇదేనమ్మగారూ నా కొడుకు కథ'

రాములు కన్నీటి కథ విన్న రాజేశ్వరి మనసు వికలమైపోయింది.

'ఊర్కో రాములూ. ఏడవకు. ఏనాడు ఏ పాపం చేశావో, దేవుడు నీకిలాంటి శిక్ష వేశాడు' అంది. ఆమె కళ్ళల్లో కూడా లీలగా కన్నీళ్ళు కదలాడాయి.

'పాపమే చేశానమ్మా. ఆనాడు అనుమంటి కొడుకుని పోగొట్టుకున్న నేను, అప్పుడే సచ్చిపోయుండేదాన్ని. కానీ, మిగిలిన యిద్దరు పిల్లలకీ నేను తల్లిని. పని వాళ్ళు జరిగిన యీ ఘోరాన్ని చూసే బెదిరిపోయారు. నన్ను కర్చుకుపోయారు. ఏదన్నా సేస్తే అల్ల కన్నాయం సేసిన దాన్నౌవుతాను. గుండె పట్టుకుని బతికానమ్మా. కొన్నాళ్ళు మనసు బాగోక ఎక్కడికీ యెల్లనేదు. మా యాయన తెచ్చేది సాలక, తిండికి కష్టమై పోతుంటే, మల్లా మీ యింటిలో పనికి చేరాను.'

కంటితో చూడ్డమే కాకుండా, మనసర్పించి కదలాడే ఆ తల్లి హృదయాన్ని చూసిన రాజేశ్వరికి యిప్పుడర్థమైంది, ఆ తల్లి ఆరాటమేమిటో.

రాములు అక్కడ్నుంచి లేచి, చెంబుతో నీళ్ళు తీసుకుని మొహం కడుక్కుంది. అసలు సంగతి మర్చిపోయి, ఏదో ధ్యాసలో వున్నదానిలా, 'వెళ్తా నమ్మా' అని ముందరకు నడిచింది.

రాజేశ్వరి అక్కడ్నుంచి కదల్లేక పోయింది. తన మనసులో మాట రాములికి చెప్తేగానీ ఆమెకు మనసు నిలిచేలా లేదు.

'రాములూ' అని, వెళిపోతున్న రాముల్ని వెనక్కు పిలిచింది.

రాములొచ్చింది.

'చూడు రాములూ. నువ్వు రేపు రానవసరం లేదు. నేనే ఎలాగో చేసుకుంటాను. నీ బిడ్డల్ని జాగ్రత్తగా చూసుకో నువ్వు' అని పలికింది.

తృప్తిగా రాజేశ్వరిని చూసింది రాములు.

'మీ లాంటి తల్లులున్నంత వరకూ, నాలాటోళ్ళకేం ఫరవాలేదమ్మా' అన్నట్టున్నాయి ఆ చూపులు.

'అలాగే నమ్మా' అని వెళుతున్న రాముల్ని చూస్తూ నిలుచున్న రాజేశ్వరి మనసు, 'పాపం' అని పశ్చాత్తాప పడింది. □

## చిట్టి కథ

### బొమ్మ



సాయంకాలం ఆఫీస్ నించి తిరిగొస్తున్నాను. నాలుగురోడ్ల కూడలిలో ఓ బిచ్చగాడిలాంటి మనిషి ఏదో బొమ్మ గీస్తూ కనిపించాడు—మసిబొగ్గుతో. కొన్నిరంగుల సుద్దలు కూడా దగ్గర పెట్టుకున్నాడు. కాసేపట్లోనే అతని బొమ్మరూపు సంతరించుకుంది. దారిన పోతున్న జనం ఓ క్షణం ఆగి, చూసి వెళ్తున్నారు. ఆ బొమ్మ హిందువుల ఆరాధ్య దైవం—ఏడుకొండలవాడు. చెయ్యితిరిగిన చిత్రకారుడి బొమ్మలా మెరిసిపోతోంది—బిచ్చగాడు వేసిన కలర్సుకి. బొమ్మ పూర్తిచేసి, ప్రక్కనే భక్తిగా నమస్కరిస్తూ కూచున్నాడు బిచ్చగాడు.

పోగుపడ్డ జనం భక్తితోనో, ఆ భిక్షకుడి ఆర్టుకి సంతోషంతోనో, అయిదు, పదిపైసలు తీసి బొమ్మ మీదికి విసిరి పోతున్నారు. కాసేపట్లోనే బొమ్మ ఆకారం కూడా కనిపించనంత మందంగా డబ్బులు పేరుకుపోయాయి. నేనంతా గమనిస్తూనే వున్నాను. కొద్దినిమిషాల్లోనే దాదాపు వంద రూపాయలవరకు సంపాదించాడు.

ఆ తర్వాత మరో వారం రోజులకే ఓ ఆదివారం సాయంత్రం స్నేహితురాలిని కలుద్దామని జగన్నాధపురం వెళ్ళాను. చర్చి స్క్వేర్ దగ్గర చాలా మంది జనం గుమిగూడి వుంటే, ఏమిటోనని ఆటుపోయి చూశాను. అక్కడ జీసస్ క్రైస్తు బొమ్మ; బొమ్మచుట్టూ రంగు రంగుల కొవ్వొత్తులు వెలుగుతున్నాయి. కిందుగా 'కరుణామయుడు' అని అందమైన అక్షరాలు. పక్కనే, మెడలో శిలువబొమ్మ ధరించిన బిచ్చగాడిలాంటి వ్యక్తి మోకాళ్ళమీద కూచుని రెండు చేతులూ చాచి ఆకాశం వంక చూస్తూ ప్రార్థనలో లీనమయి వున్నాడు. అతనే ఆ బొమ్మ గీసినవాడయి వుంటాడని గ్రహించాను. ఏసుక్రీస్తు బొమ్మనిండా ఖాళీ లేకుండా పావలాలు అర్ధరూపాయలు, రూపాయినోట్లు! భక్తులు తమ ప్రభువుపేర ఆ చిత్రకారుడికి సమర్పించుకుంటున్న కానుకలు అవి! ఆ చిత్రకారుడి ముఖంలోకి పరీక్షగా చూసి, తృళ్ళిపడ్డాను. అతనెవరోకాదు—వారంరోజుల క్రితం నాలుగు రోడ్ల కూడలిలో వేంకటేశ్వరస్వామి బొమ్మ గీచినవ్యక్తే! అప్పుడు హిందువుల ఆరాధ్య దైవాన్ని సజీవంగా చిత్రించి పూజిస్తూ కనిపించినవాడే, యీరోజు ఏసుప్రభువుని చిత్రించి రెట్టింపు భక్తిశ్రద్ధలతో ప్రార్థన చేస్తున్నాడు.

నాకో చిన్న సందేహం వచ్చింది. ఇంతకీ అతను హిందువా, క్రైస్తువుడా—తెలుసుకోవాలనిపించింది.

జనం పూర్తిగా వెళ్ళిపోయాక ఆ భిక్షకుణ్ణి సమీపించి నా అనుమానం వెల్లడించాను.

ఆ భిక్షగాడు నా వంక బెదురుతూ చూసి చుట్టూ యింకా మిగిలిన జనం వింటారేమోననే భయంతో, నోటితో ఏం చెప్పకుండా, తన కుడిచేయి నా ముందుకి చాపాడు నాకు మాత్రమే కనిపించేలాగ. అతని ముంజేతిమీద—"అబ్దుల్‌కరీం" అన్న పచ్చబొట్టు కొట్టొచ్చినట్టు కనిపించింది నాకు!

—బొమ్మిడి రాజేశ్వరి